# విసిరిన వల

"టక్, టక్, టక్"

తలుపు శబ్దం విని జానకి చేతిలోని పుస్తకం టేబులుమీద పెట్టి ఆలకించింది. తమ తలుపే నని తెలియగానే కుర్చీలోనుంచి లేచింది చిరాకుగా. ఎవరో తలుపు వూపిరాడకుండా కొడుతున్నారు.

"ఎవరూ ?" అన్నది జానకి తీవ్ర స్వరంతో.

"నేనే, తలుపుతీయి జానకీ" విన్పించింది తలుపు అవతలనుండి.

"నేనే అంటే ? నీకు పేరూ, వూరూ లేదూ ?" అన్నది కోపం సూచించే స్వరంతో. ఆ "నేనే" అన్నది ఎవరో తెలియక కాదు, తెలియటం వల్లనే అలాఅన్నది.

"నేనే ! జానకీ ! రామాన్ని" తలుపవతలనుండి విన్పించింది.

ఆ మాటలు పూర్తి అయీ కాకముందే గొళ్లెం శబ్దం. "ధఢ్" మని తలుపు మోగటం, రామం నోటి నుండి "అబ్బా" అంటూ మూలుగు, ఒకేసారి విన్పించాయి,

"దెబ్బ తగిలిందా?"

"దెబ్బకేంలే, కోపం తగ్గిందా!" అన్నాడు రామం దెబ్బతో దిమ్మెరపోయిన తలను పట్టుకొనే.

"మొండి ఘటం" మనసులో అనుకుంది జానకి.

"ఇంట్లో ఎవరూ లేరు. అమ్మా వాళ్ళు మైలాపూరు గుడికి వెళ్ళారు."

జానకి మాటల వైఖరి చూస్తే అప్పుడు అతను రావటం ఆమె కెంతమాత్రం ఇష్టం లేదని ఇట్టే తెలిసి పోతుంది. కాని రామారావుకు ఆమె వైఖరి తెలిసిందో లేదో అతనికే తెలియాలి. తామరాకు మీది నీటిబొట్టు లాగ, నిర్లిప్తంగా లోపలకుపోయి కూర్చున్నాడు నొసటి మీద కట్టిన బొప్పి నిమురుకుంటూ.

జానకి వంటిమీద తేళ్ళూ, జెఱ్ఱులూను పాకుతు న్నట్లనిపించింది. కాని ఎలాగో తమాయించుకుని కూర్చుంది. పల్కకుండా బేబులుమీది పుస్తకాన్ని తీసి పేజీలు తిప్ప సాగింది.

"నేనంటే నీకెందుకంత కోపం జానకీ" అన్నాడు రామం పరీక్ష ఫెయిలయిన విద్యార్థి ముఖం పెట్టి.

జానకి ఆమాట లేవీ విననట్లే పుస్తకంలోకి దీక్షగా చూస్తోంది. ఆమె ముఖం చూస్తే ఏదో తీవ్రంగా ఆలో చిస్తున్నట్లుంది.

"నిన్ను అనవసరంగా బాధ పెడుతున్నందుకు క్షమించు, జానకీ! ఎంత వద్దనుకున్నా రాకుండా వుండ

లేకపోతున్నా. నిన్ను చూస్తున్నంతసేపూ నా హృదయం ఆనందంతో...."

"జపాను రబ్బరు బంతిలా గంతులేస్తుందా లేక వైజయంతిమాలలాగ నాట్యం చేస్తుందా? నిన్ను చూస్తుంటే నా హృదయం ఎలాగవుతుందో తెలుసా?"

"కోపంతోనే? నన్నెందుకిలా అసహ్యించుకుంటావు? నేనేం చేశానో చెప్పకూడదూ?" అన్నాడు రామం హృదయంలోని ప్రేమనంతా కడవల్లోని నీరులా కండ్లనుండి గుమ్మరిస్తూ.

"లేకపోతే ఏమిటి? అవతల మనిషిని అర్థం చేసుకోకుండా, ఫూల్‌గా ప్రవర్తిస్తూ! నీతో యిప్పటికెన్నిసార్లు చెప్పలేదు. నీతో మాట్లాడటం, కనీసం నీకు ఎదురుగా కూర్చోవటంకూడా నాకిష్టం లేదని? మానాభిమానాలు చంపుకొని యిలాతిరక్కపోతే, ముక్కుమూసుకుంటే మూడు ఘడియలు పట్టదు."

"ప్రేమకు బుర్రా, చెవులూ కూడా వుండవు!" అన్నది జానకి వచ్చే నవ్వును ఆపుకుంటూ.

"ప్రేమకు మానాభిమానాలూ, కనీసం కళ్ళు కూడా వుండవని పెద్దపెద్ద కవులే చెప్పారుగా?"

జానకి నవ్వుముఖం చూసేటప్పటికి రామం ముఖం చాటంతయింది. సమయాన్ని జారవిడవకుండా అందుకున్నాడు.

"నీకు నవ్వులాటగా వుంది. కాని నాపరిస్థితి ఎలా వుందో కొంచెం ఆలోచించు. నా పవిత్ర ప్రేమను త్రృణీ

కరించకు. నీకోరకు ఏదిచేయమన్నా సర్వకాల సర్వావస్థలయందూ సంసిద్ధుడనే" అన్నాడు రామం సినిమా హీరో పోజుతో.

"అయితే పర్వత శిఖరం నుంచి-?"

"క్రిందకు అఘాతంలోకి దూకుతాను"

"దొంగతనం చేసి...."

"జైలుకు పోతాను"

"మానాభిమానాలు...."

"ముందే చెప్పాగా నీకోరకేదైనా చేస్తానని?"

జానకి దేన్నిగురించో తీవ్రంగా ఆలోచిస్తోంది. ఆమె ముఖంలో క్షణం సేపు విచారం, మళ్ళీ వెంటనే ఏదో నిశ్చయానికి వచ్చిన సంకల్పచ్ఛాయలు గోచరించాయి.

రామం ఆమె ముఖభావాలను జాగ్రత్తగా చదువ ప్రయత్నిస్తున్నాడు.

"క్షమించు రామం. నిన్ను అర్థం చేసుకోలేక చాలా బాధ పెట్టాను. కాని అందచందాల్లో నీకు నేను తగినదాన్ని కాను," అన్నది జానకి రామం కళ్ళల్లోకి చూస్తూ.

"నాకు కావలసింది నీ అందం కాదు, నీవు" అన్నాడు రామం ఎంతో ధీమాగా.

"మన కులం కూడా ఒకటి కాదు."

"ప్రేమకు కులమత భేదాలు లేవు, జానకీ!"

"మా వాళ్ళు ఒప్పుకోరు, ఈ విషయం తెలిస్తే రేపే ఎవరికో ఓ కులంగల కోతిని చూసి ముడివేస్తారు."

"అందుకే మనం ఎవరికీ తెలియకుండా వెళ్ళిపోయి రిజిష్టరు మారేజి చేసుకొందాం. ఆ తరువాత మీ వాళ్ళకు తెలియపరుద్దాం."

"అప్పుడు మా వాళ్ళు నాకు ఆస్తి ఇవ్వకపోతే? నీకూ పెద్ద ఆస్తి లేదాయె" అన్నది జానకి రామం కళ్ళలో దేన్నో వెదుకుతూ.

"మీ అమ్మా నాన్నకు నీకంటె ఇంకెవరున్నారు. మొదట కొన్నిరోజులు కోపంతో వున్నా తరువాత వాళ్ళే బతిమాలి మరీ కూతుర్నీ, అల్లుణ్ణీ ఇంట్లో తెచ్చి పెట్టు కుంటారు."

"సరి! అయితే ఎప్పుడు వెళ్దాం?"

"ఆలస్యం అమృతం విషం అన్నారు పెద్దలు. ఈ రోజే వెళ్ళి పోదాం. కాని డబ్బు?" అన్నాడు రామం జానకి మెడనంక చూస్తూ.

రామం చూపులోని అంతరార్థాన్ని అర్థం చేసుకొన్న జానకి నవ్వుకొంటూ లోపలకు వెళ్ళింది రెండు నిముషాల్లో ఓ చిన్న అట్టపెట్టె తెచ్చి రామం చేతిలో పెట్టింది.

రామం ఆతృంగా పెట్టెను అందుకొని యింతంతేసి కళ్ళు చేసుకుంటూ పెట్టెను తెరచాడు. కళ్ళు జిగేల్ మన్నాయి. నాలుగు పేటల గొలుసు.

"ఇది అమ్మేసి వెంటనే వచ్చేసేయ్. అమ్మా వాళ్ళు ఏడు గంటలకు కాని రారు. ఈ లోపలే మనం అన్ని ప్రయత్నాలూ చేసుకోవాలి."

చివరకు విజయం తనదే అయింది. ముందు ఉన్న బెట్టూ, బింకం పోయింది? దాదాపు సంవత్సరం రోజులుగా తన్నిలా ఏడ్పించింది. తనే అంత తక్కువ తిన్నవాడు కాబోలు? యిలాంటి ఆడవాళ్ళ నెంతమందిని చూడలేదు తను? అసలు అదేం బుద్ధో కాని యీ ఆడవాళ్ళే యింత!

జానకి తనను ఎన్నిమాటలంది? ఎంత అవమానం చేసేది? ఇంతా తనమీద ప్రేమతోనే సహిస్తున్నాడను కుంటూంది లాగుంది పాపం! తను ప్రయత్నించాలే గాని ఏ ఆడది తన వల్లో చిక్కకుండా పోగలదు? డబ్బు లేక పోతేనేం తనకున్న తెలివితేటలు చాలవూ?

ఆ సత్యం పట్టి పిచ్చోడు. జానకంటే ప్రాణాలు విడుస్తున్నాడు. కాని ఏం లాభం? ఆమెతో మాట్లాడటానికే సాహసం లేదు. ఆడవాళ్ళ దగ్గర తమ ప్రేమను ప్రకటించటం నిజంగా మాటలా? దాని కెంత బుర్ర వుండాలి?

ఇలా ఆలోచిస్తూనే ఓ షరాబు దుకాణాని కెళ్ళాడు రామం. తన జేబునుండి గొలుసు తీసి మార్వాడీ చేతిలో

పెట్టాడు. మార్వాడీ ముక్కు చివరవరకు జారివున్న చత్వారపు కళ్ళజోడులో నుండి రామాన్ని ఆపాదమస్త కం ఒకసారి పరికించాడు. ఆ చూపు తనను అనుమానిస్తు న్నట్లు తోచింది రామానికి.

"ఏమిటలా చూస్తున్నావు? నేనేమైనా దొంగ ననుకున్నావా?" అన్నాడు రామం కోపంగా.

మార్వాడీ ఇంకోసారి రామాన్ని పైనుండి కిందకు శల్యపరీక్ష చేసి, మరోసారి గొలుసువంక చూచి, గొలుసు రామం చేతిలో పెట్టి వుండమని చూపుల్తోనే చెప్పి, గీటు రాయికోసం లోపల కెళ్ళాడు.

* * *

"టక్, టక్, టక్"

ఏమో ఆలోచిస్తూ కూర్చున్న జానకి వులిక్కిపడి లేచి వెళ్ళి తలుపుతీసి చిన్నగానే నెట్టింది.

ఈసారి రామానికి తలుపు దెబ్బ తగలక పోయినా "చిన్నగా నెట్టకూడదూ?" అంటూ కస్సున లేచాడు.

"ఏం అప్పుడే అధికారం మొదలెట్టావు?" అంది జానకి వచ్చే నవ్వును ఆపుకుంటూ.

రామారావు విసురుగా లోపలికొచ్చాడు. ముఖ మంతా ఎర్రగా కండగడ్డలా వుంది. కోపంతో, ఏదో రోషంతో పెదాలు వణుకుతున్నాయి. రామరావు

వాలకం చూచిన జానకి పలక్కుండా ఏదో ఆలోచిస్తూ కుర్చీలో కూలబడింది.

"నన్నింత అవమాన పరుస్తావా? అందుకే ఆడ దాన్ని నమ్మకూడదని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి.". అన్నాడు వుక్రోషంతో.

"నేనేం చేశాను? అంత అవమానం ఏం జరిగిం దేమిటి?" అన్నది జానకి అర్థం కానట్లు.

"యింకేం జరగాలి? బంగారపు గొలుసని చెప్పి, బంగారం మెరుగు పెట్టిన యిత్తడి గొలుసిచ్చి పంపి స్తావా? ఆ మార్వాడీ పోలీసులక్కూడా అప్ప చెపుతా నని బెదిరించాడు."

"యింతకు ముందే అన్నావుగా నాకొరకేద యినా చేస్తానని?" అన్నది జానకి నిర్లక్ష్యంగా.

"ఏదో మాట వరసకు అంటే...."

"అవును. నీవనే మాటలన్నీ యిలాంటి మాట వరసకనేవే నని నాకు తెలుసు. నీప్రేమంతా నా డబ్బు మీదనేననికూడా నాకు తెలుసు. ప్రేమించే వా డెవడూ అలాగ అసలు అనడు. నీవే ఒకసారి అన్నావు గుర్తుందీ— "ఎవరయినా ఒకదాన్ని గురించి చాలా యిష్టంవున్నట్లు మాటి మాటికీ చెపుతూవుంటే దాని అర్థం యిష్టం లేనట్లనీ, ఒక విషయాన్ని గురించి మాటి మాటికీ ఏవగించుకుంటున్నట్లు యిష్టం లేనట్లు నటిస్తే యిష్టం వున్నట్లనీ."

రామం పని దొంగకు తేలుకుట్టినట్లయింది. "నా ప్రేమంతా నీ డబ్బుమీదనే నని ఎలా అనగలవు?" అన్నాడు పట్టుబడ్డ దొంగలాగ.

"సరోజిని నిన్నెంతగానో ప్రేమిస్తున్నది. నా పరిచయానికి ముందు నీవూ ప్రేమిస్తున్నట్లే నటించావట. సరోజిని కంటే నాలో ఒక్క డబ్బును మినహాయిస్తే ఏ విశేషమూ లేదు."

"ఆ విషయాన్ని నిర్ణయించాల్సింది నేను కాని నువ్వు కాదు. నాకేం కావాలో నీకంటే నాకు ఎక్కువ తెలుసునని ఒప్పుకుంటావా" అన్నాడు సడలిపోతున్న ధైర్యాన్ని కూడదీసుకుంటూ.

"అయితే నాకు డబ్బు లేకపోయినా నన్ను వివాహమాడేవాడినన్న మాట!"

"తప్పకుండా?" అన్నాడు గంభీరంగా. కాని ఆ మాట అనేటప్పుడు అతనికి ఆమె కళ్ళలోకి చూసే ధైర్యం లేదు. ఉంగరాలు చుట్టుకుంటున్న సిగరెట్టు పొగలోకి చూస్తూ అన్నాడు.

జానకి ముఖంలో హాసరేఖలులీలగా కన్పించాయి.

"మా ఆస్తంతా ఆ గోలుసు లాగా పైపై మెరుగు-అయితే...."

"అంటే?" అన్న అతని నోరు ఆశ్చర్యంతో అలాగే తెరచుకొని వుండిపోయింది.

"అంటే ఏమీ లేదు. రెండు సంవత్సరాలక్రితమే మా ఆస్తంతా అప్పుల పాలయిందట. మా నాన్న యిప్పటివరకూ పైపై మెరుగులతో పళ్ళ బిగువుతో

గడుపుకోస్తున్నాడట. ఈ బంగళా తాకట్టులో వుంది. ఈ సోఫాలు అద్దెవి. ఈ నగలన్నీ గిల్టువి. నా పెండ్లయేంతవరకూ ఇలా బతక్క తప్పదట."

రామరావు పని వడదెబ్బ కొట్టినవానిలాగ వుంది. ఆ తెరచిన నోరు ఇంకా పూర్తిగా మూత పడలేదు. దాహం వేస్తోంది.

"అయితే నీక్కావలసింది నాడబ్బు కాదు నేనేగా? ఈ వివాహానికి మా అమ్మ నాన్నా కూడా ఒప్పుకుంటారు" అంటూ జానకి ముఖంలోకి దీక్షగా చూసింది.

రామం కొంచెం తేరుకొని అన్నాడు "ఇవ్వాళ నామనసంతా కలతబారి వుంది. ఇప్పుడు నేనేమీ మాట్లాడలేను. రేపు మళ్ళీ కన్పిస్తాను." అంటూ పోతున్న రామాన్ని చూసి జానకి పొడిగా నవ్వింది. ఆమె కళ్ళ కొలుకులు చెమ్మగిల్లాయి.

ఆ వెళ్ళిన వెళ్ళటం మళ్ళీ ఆ ఇంటి చాయల కన్పించలేదు రామారావు.

• • • •

"టక్, టక్, టక్."

రామారావును గురించే ఆలోచిస్తూ కూర్చొన్న జానకి తలుపు శబ్దానికి వులిక్కి పడ్డది. అతనే వచ్చివుంటాడనే ఉత్సాహంతో తలుపు తీసిన జానకి ఎదురుగా నిల్చున్న సత్యాన్ని చూసి చల్లబడింది. సరే ఇతన్నికూడా ఈ రోజునుండే వదిలించుకో దల్చుకుంది.

"ఏం జానకీ అలా వున్నావు, నేను రావటం ఇష్టం లేదా?" అన్నాడు సత్యం జానకి ముఖాన్ని పరీక్షిస్తూ.

అలా కుండ బద్దలు కొట్టినట్లడిగే సత్యం ముందు జానకి కొంచెం ఇరుగ్గా ఫీలయింది. అతను అలాంటి వాడని తెలిసే జానకి అతన్ని గౌరవిస్తుంది కూడా.

"అబ్బే! అదేం కాదు. రా కూర్చో" అంది ముఖంలో లేని నవ్వు తెచ్చుకుంటూ,

కొంచెం సేపు యిద్దరూ మౌనంగా కూర్చున్నారు. సత్యం ఎక్కువ సేపు మౌనంగా కూర్చోలేకపోయాడు.

"జానకీ! ఇవ్వాళ నిన్నొక విషయం అడగాలని వచ్చాను. నిజం చెబుతావా?" అన్నాడు.

"ఏమిటది. అడుగు" అంది జానకి.

"నీ వంటే నా కిష్టం. నిన్ను పెళ్ళిచేసుకోవాలని ఉంది, నీకూ ఇష్టమేనా?" అంటూ ఆమె కళ్ళలోకి చూశాడు.

"నీ ఇష్టం నామీదా, లేక నా డబ్బుమీదా?" అని అడిగింది.

"రెంటిమీదాను." అన్న సత్యం మాటలకు జానకి వులిక్కిపడింది. ఇత నెప్పుడూ ఇంతే. ముక్కుకు సూటిగా మాట్లాడేస్తాడనుకుంది.

"ఈ రెంటిలో దేనిమీద ఎక్కువ ఇష్టం, నామీదా లేక డబ్బుమీదా?"

"ఆ విషయం ఇప్పు డెలా చెప్పగలనూ! నువ్వూ డబ్బూ కల్సి ఉన్నంత వరకూ ఎవరిమీద ఎక్కువ ప్రేమో చెప్పడం కష్టం?" అన్నాడు కొంటెగా చూస్తూ.

"అయితే నా కొరకు నీవు ఏదైనా చేస్తావా?" అన్నది యాదాలాపనగా.

"అంటే?" అన్నాడు సత్యం.

"పర్వత శిఖరంనుండి....?"

"దూకను."

జానకి ముఖం తెల్లబోయింది. మరల అడిగింది. "మానాభిమానాలు?"

"చంపుకోను, నాకు కావాల్సింది నీ ప్రేమ. దానికి బదులు ప్రేమను మాత్రమే యివ్వగలను."

ఇంతలో మైలాపూర్ వెళ్ళిన జానకి అమ్మా వాళ్లు తిరిగి రావటంతో మాటల ధోరణి మార్చారు.

• • • •

"ఏ రోయ్; సత్యం! ఏం విశేషం? బలే జల్సాగా వున్నావ్? ఏ క్రాసువర్డు పజిల్సులోనైనా ఓ లక్ష కొట్టే శావా ఏమిటి?" అన్నాడు రామారావు సత్యంతో.

"అంత తెలివితేటలు మన కెక్కడున్నాయ్ రా?" అన్నాడు సత్యం నవ్వుతూ.

"అయితే ఏ ముసలమ్మో కూడబెట్టిన యింత ముదనష్టం వచ్చి పడలేదు గదా?"

"అబ్బే, మన కలాంటి వారసు లెవ్వరూ లేరుగా."

"ఏ లఖాధికారి కూతుర్నయినా పట్టావా?" అన్నాడు రామారావు తనకు చెందాల్సిన దాన్నెవరో యితర్లు తన్నుకు పోతున్నట్లు ఫీ లవుతూ.

"ఆఁ అలాంటిదే జరిగిందిలే."

"ఏవూరోయ్? మొత్తంమీద అదృష్ట జాతకుడవు. నాకు చూడు ఎంత తెలివి తేటలుంటే మాత్రం ఏం లాభం. యిలాంటి వాటికి నీలాగా ఉపయోగించుకో లేను." అన్న రామారావు కళ్ళనుండి అసూయ తొంగి చూస్తున్నది.

"ఆఁ-నా మొహం; నేను ఉపయోగించటానికి అసలు అలాంటి తెలివి తేటలు నాకుంటే గదూ?"

"అది సరేలే; అసలు పిల్ల ఎవరో చెప్పావు గాదూ?"

"మన క్లాసుమేటు జానకే. నేను ఆ అమ్మాయిని మొదటినుండీ ప్రేమించాను. కాని నా ప్రేమను తెలియ పర్చే సాహసం నాలో లేకపోయింది. దానిక్కారణం ముఖ్యంగా నా భీరతనమే. అదీ కాక ఆ అమ్మాయి యింకెవర్నో ప్రేమించిందట."

రామం ఎక్కడో అగాధంలోకి పడిపోతున్నాడు. ఏదో ఆధారంకోసం వెతుక్కుంటున్నట్లు అన్నాడు "మరి

అతన్నెందుకు చేసుకోలేదు?" అని, అతని స్వరం అతని చెవులకే వికృతంగా, బొంగురుగా విన్పించింది.

"జానకి బాగా ఆలోచించందే తాత్కాలిక ఉద్రేకంతో ఏ పనీ తొందరపడి చెయ్యదని నీకూ తెల్సుగా? ఆమెకు అతని ప్రేమ మీద నమ్మకంలేక ఏదో నాటకం ఆడిందట."

ఏదో అగాధంలోకి పడిపోతున్నవాడు జారుడు రాళ్ళ సహాయంతో నిల్చోవటానికి ప్రయత్నిస్తు వున్నట్లున్నాడు రామం.

"అయితే నీ దగ్గర కూడా నాటకమాడిందా?" అన్నాడు రామం కళ్ళు పెద్దవిచేసి.

"నా దగ్గర నాటక మాడటానికి నేను ఆడితేగా. నేను నిజం చెప్పాను. నాకు తెలివిగా మాట్లాట్టం రాదని నీవే అంటావుగా?" అన్నాడు సత్యం.

వస్తానని కూడా చెప్పకుండా తాగిన వాడిలా ఏదో మైకంలో వూగుతూ వెళ్ళిపోతున్న రామారావును కళ్ళప్పగించి చూస్తూ నిల్చున్నాడు సత్యం.